క్లుప్తంగా

ఆటో డ్రైవర్ నిజాయితీ

కడియం: ఆటోలో ప్రయాణికురాలు మర్చిపోయిన బ్యాగ్‌ను డ్రైవర్ నిజాయితీగా పోలీసులకు అందజేశాడు. మాధవరాయుడుపాలెం గ్రామానికి చెంది ఎస్.మణి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఊరికి బయలుదేరింది. కడియం బస్టాండ్ వద్ద దుస్తులు తదితర వస్తువులతో కూడిన బ్యాగ్‌ను ఆటోలో మర్చిపోయింది. దీంతో సదరు ఆటో డ్రైవర్ తన ఆటోలో బ్యాగ్‌ను గుర్తించి, మార్గం మధ్యలో ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. అక్కడి నుంచి వారు కడియం పోలీస్‌లకు అందజేయడంతో, బ్యాగును మహిళ కుటుంబ సభ్యులకు అందించారు.

నేడు విద్యుత్ అంతరాయం

సీటీఆర్ఐ: చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల పనుల నేపథ్యంలో శుక్రవారం నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కంభంవారి సత్రం, చందాసత్రం, వంకాయల వారి వీధి, మెయిన్ రోడ్డు, ఉల్లి తోట వీధి, టౌన్ హాల్ రోడ్డు, మెరక వీధి, కోటక్ మహీంద్రా బ్యాంక్ వీధి, స్టేడియం రోడ్డు, ఆవ రోడ్డు, శ్యామల బ్యాక్ సైడ్ రోడ్డు, డీలక్స్ సెంటర్ గొల్ల వీధి, శ్యామల థియేటర్, మెయిన్ రోడ్డులో విద్యుత్ ఉండదు.
- ఉదయం 7.30 నుంచి 12.30 గంటల వరకూ గాంధీపురం 3, శ్యామల నగర్, గోరక్షణ పేట, శీలం నూకరాజు రోడ్డు, వేంకటేశ్వర జనరల్ మార్కెట్, సోమాలమ్మ పుంత రోడ్డు, డైమండ్ పార్క్ ఏరియాల్లో సరఫరా నిలిచిపోతుంది.

నేటి నుంచి హజరత్ ఖకార్ష ఉరుసు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరంలోని గూడ్స్ షెడ్ వద్ద ఉన్న హజరత్ ఖకార్ష ఖాదరి ఔలియా ఉరుసు ఉత్సవాలు శుక్రవారం నుంచి మొదలుకానున్నాయి. ఈ విషయాన్ని దర్గా ఆర్గనైజర్, ముజావర్ షేక్ అల్లా బక్షీ, ముజావర్లు షేక్ మదీనా పాషా, షేక్ ఖాదర్ హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు గ్యార్మి ఫాతిహా అనంతరం పన్నీరు స్నానం ఉంటుందన్నారు. శనివారం ఉదయం 8 గంటలకు ఖురాన్ పఠనం, 8వ తేదీన ఉరుసు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా గుర్రం, ఫకీరు మేళాలతో ఊరేగింపు, అనంతరం గంధోత్సవం జరుగుతాయన్నారు. ఉదయం, సాయంత్రం మహన్నదానం నిర్వహిస్తామన్నారు. 9వ తేదీ రాత్రి 9 గంటలకు మిలాద్, దీపారాధన జరుగుతాయని తెలిపారు.

తొలగింపు ఉత్తర్వులు జారీ చేయడం దారుణం

రాజమహేంద్రవరం రూరల్: వైద్య, ఆరోగ్య శాఖలో సుమారు 20 ఏళ్లకు పైబడి పనిచేస్తున్న మగ ఆరోగ్య సహాయకులకు గడువు ఉండగానే తొలగింపు ఉత్తర్వులు జారీ చేయడం దారుణమని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ రాజు, ప్రధాన కార్యదర్శి ఆస్కరరావు ఆవేదన వ్యక్తం చేశారు. వారిని 120 రోజుల లోపల తొలగించి తాజాగా నియామకపు మెరిట్‌ను ప్రకటించాలని తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. కానీ గడువు ఉండగానే హఠాత్తుగా తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు. వైద్య,ఆరోగ్య శాఖలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2002లో జీవోఎంఎస్ నంబర్ 459 ద్వారా దఫాలుగా జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా వీరిని నియమించారన్నారు. ప్రభుత్వ ట్రైనింగ్ సెంటర్లలో శిక్షణ పొందిన అభ్యర్థులకు అప్పటి హైకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో మెరిట్ లేకున్నా కొందరిని నియామకాలు ఇచ్చారన్నారు. అనంతరం న్యాయపరమైన చిక్కుల కారణంగా ఇప్పటి వరకూ కొనసాగిందన్నారు. ప్రస్తుతం దాదాపు రెండు వేల మందిని తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. వారిని తొలగించకుండా ఉద్యోగ భద్రత కల్పించాలి అని ప్రభుత్వాన్ని కోరారు.

కేసుల మోత

- అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లపై నిఘా
- ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్
- పలువురిపై కేసులు

కంబాలచెరువు: రాజమహేంద్రవరంలోని రహదారులపై నిత్యం ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. వచ్చీపోయే వాహనాలతో రోడ్లన్నీ నిండి పోతాయి. ఈ సమయంలో వాహనాన్ని నడపడమే కష్టంగా ఉంటుంది. రోడ్డుపైకి వస్తే చాలు వెనుక, ముందు వచ్చే వాహనాల హారన్లతో విసుగు వచ్చేసింది. ఈ ఇబ్బందులన్నీ నగరంలో వాహనచోదకులు నిత్యం పడేవే. ఇప్పుడు కొత్తగా మరో సమస్య వచ్చింది. కొందరు ఆకతాయిలు అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను మోటార్ సైకిళ్లకు బిగించుకుని రాకపోకలు సాగిస్తున్నారు. వాహనాన్ని అతి వేగంగా నడుపుతూ తోటి వాహనచోదకులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. సైలెన్సర్ల నుంచి వచ్చే అధిక శబ్దంతో ప్రజలు, తోటి వాహనచోదకులు భయాందోళనకు గురవుతున్నారు. దీంతో ఆకతాయిల చేష్టలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి కేసులు నమోదు చేస్తున్నారు.

భయాందోళన

అధిక శబ్దం కలిగిన సైలెన్సర్లతో ఆకతాయిలకు వినోదం లభిస్తున్నా.. మిగిలిన వారు మాత్రం భయాందోళనకు గురవుతున్నారు. దీంతో ఆకతాయిలను ఆగడాలకు చెక్ పెట్టేందుకు ఎస్పీ డి.నరసింహ కిశోర్ చర్యలు చేపట్టారు. ఆయన ఆదేశాల మేరకు నగరంలో పలు చోట్ల ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తూ ఆకతాయిలను పట్టుకుంటున్నారు. దీంతో అధిక శబ్దం కలిగిన సైలెన్సర్లను వినియోగిస్తున్న వారిపై కేసుల మోత మోగుతోంది.

నిరంతరం తనిఖీలు

గతంలోనూ ఇలాంటి సైలెన్సర్లు వినియోగించిన వారిపై చర్యలు తీసుకున్నారు. బైక్‌ల నుంచి వాటిని తొలగించి రోడ్డు రోలర్‌తో తొక్కించేవారు. ఈ విధానాన్ని ఇక నుంచి నిరంతరం చేసే దిశగా పోలీసులు ముందుకు కదలారు. దీంతో నిత్యం సైలెన్సర్ డ్రైవ్ చేపట్టడానికి ట్రాఫిక్ పోలీసులు నడుం బిగించారు. ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది కలిసి పనిచేయనున్నారు.



ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న సైలెన్సర్లు

వారం రోజుల్లో..

ముందుగా అధిక శబ్దం వచ్చేలా సైలెన్సర్లను అమర్చిన మోటారు సైకిళ్లను గుర్తిస్తారు. వాటిని డిజిటల్ నాయిస్ లెవెల్ మీటర్ ద్వారా చెక్ చేస్తారు. 80 డెసిబుల్స్ శబ్దం కలిగించే వాహనాలను గుర్తించి, వారిపై వాహన చట్టం యూఎస్ 190/2 ప్రకారం కేసులు నమోదు చేయనున్నారు. ఇలా నగరంలో వారం రోజులుగా 226 పైగా వాహనాలను గుర్తించి, వాటి సైలెన్సర్లు తొలగించి, కేసులు నమోదు చేశారు.

బిగించినా నేరమే

అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను బిగించుకుని తిరిగే వాహనచోదకులతో పాటు వాటిని బిగిస్తున్న మెకానిక్‌లపైనా కేసులు నమోదు చేసే విధంగా పోలీసులు చర్యలు చేపట్టారు. ఎవరైనా అలాంటి సైలెన్సర్లు బిగించాలని వస్తే వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని మెకానిక్‌లకు సూచిస్తున్నారు.

నోటీసుల జారీ



రాజమహేంద్రవరం పరిధిలో ప్రతిరోజూ స్పెషల్ డ్రైవ్‌లు కొనసాగుతాయి. అధిక శబ్దం చేసే సైలెన్సర్లను మోటార్ సైకిల్‌కు అమర్చరాదు. వాటి నుంచి వెలువడే శబ్ద కాలుష్యంతో తోటి ప్రయాణికులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ సైలెన్సర్లు అమ్మే దుకాణాలకు నోటీసులు జారీ చేశాం. వాటిని బిగించే మెకానిక్‌ల పైనా చర్యలు తీసుకుంటాం. మోటారు వాహనాల చట్టం ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తాం.

– సీహెచ్ సూరిబాబు, ట్రాఫిక్ సీఐ, రాజమహేంద్రవరం

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రకాశం నగర్: నగరపాలక సంస్థలో పనిచేస్తున్న అన్ని వర్గాల ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడుతూ, వారి ఉద్యోగపరమైన సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. ఈ మేరకు గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థలో 2,393 మంది వివిధ కేటగిరీల సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. వారికి పదోన్నతులు, జీతాలు, సెలవులకు సంబంధించి సమస్యలు ఉంటాయన్నారు. వాటిని ప్రభుత్వ నిబంధనల మేరకు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 16 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. కాగా.. నగరపాలక సంస్థ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం.. కార్యాలయంలో ఉద్యోగులు భోజనాలు చేయడానికి ఒక హాలు కావాలని, ఉద్యోగులు పనివేళలు ముగిసిన తరువాత ఆడుకోవడానికి షటిల్ కోర్టు ఏర్పాటు చేయాలని, వాహనాల పార్కింగ్ స్థలం కేటాయించాలని, క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు వినతిపత్రాలు సమర్పించారు.

ఆర్థిక సాయం

కడియం: కడియపులంక పరిధిలోని వెంకాయమ్మపేట గ్రామానికి చెందిన బొబ్బా రవి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ గురువారం పరామర్శించారు. వారికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

- వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాస్
- ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ సేవా శిబిరం

రాజమహేంద్రవరం రూరల్: ఆధునిక వ్యవసాయ పద్ధతులను ఉపయోగించి వ్యవసాయాన్ని లాభసాటి చేసుకోవాలని రైతులకు వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ అన్నారు. రాజవోలు గ్రామంలో వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ సేవా శిబిరం గురువారంతో ముగిసింది. చివరి రోజు రైతు సదస్సు – రైతు శాస్త్రవేత్తల చర్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయ కళాశాల దత్తత గ్రామమైన రాజవోలు రైతులకు మిని కిట్ల ద్వారా వరి విత్తనాలను అందజేయడం సంతోషంగా ఉందన్నారు. వివిధ పంటల సాగుపై శాస్త్రవేత్తలు చేసిన సూచనలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



రైతు సదస్సులో ప్రదర్శనలను తిలకిస్తున్న వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు

ఆకట్టుకున్న ప్రదర్శన

రైతు సదస్సులో భాగంగా విద్యార్థులు ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. సోలార్ లైట్ ట్రాప్, టెర్రస్ గార్డెన్, సమీకృత వ్యవసాయం, వర్షం నీటి సేకరణ, సమగ్ర సస్యరక్షణ, గ్రీన్ హౌస్, ఎర తెర పద్ధతి, బయో గ్యాస్, డ్రిప్ ఇరిగేషన్, రైతు సేవా కేంద్రం, అంతర పంటలు, వర్మీ కంపోస్టు, తుంపర సేద్యం, పట్టు పురుగుల పెంపకం, మురికి నీటిశుద్ధి విధానం, అజోల్లా పెంపకం, తేమ సంరక్షణ పద్ధతులు, వర్టికల్ హైడ్రానిక్స్‌పై నమూనాలను ప్రదర్శించారు. ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జి సునీత.. విద్యార్థుల నమూనాల గురించి వివరించారు. రైతుల సందేహాలను పెద్దాపురం డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ శర్మ, అగ్రానమి ప్రొఫెసర్ అండ్ హెడ్ దక్షిణామూర్తి, మండల వ్యవసాయాధికారి భీమరాజు, మండల పశువైద్యాధికారి డాక్టర్ పి.వెంకటరావు నివృత్తి చేశారు. అనంతరం వరల్డ్ సాయిల్ డే సందర్భంగా విద్యార్థులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

మెగా పేరెంట్ మీటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న విద్యాశాఖ అధికారులు

కంబాలచెరువు: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో శనివారం ఉదయం జరగనున్న మెగా పేరెంట్ మీటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు విద్యాశాఖ కమిషనర్ వి.విజయ రామరాజు తెలిపారు. ఈ మేరకు గురువారం మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలకు వెబెక్స్ ద్వారా పలు సూచనలు చేశారు. తల్లిదండ్రులకు పంపిన ఆహ్వానాలు, వారికి చేసిన భోజనం ఏర్పాట్లపై కొందరు ప్రధానోపాధ్యాయులను ఆరా తీశారు సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా మెగా పేరెంట్ మీటింగ్‌ని పండగ వాతావరణంలో జరపాలని సూచించారు. సమావేశానికి ఏర్పాటు చేసిన కమిటీలతో చర్చించి, ప్రణాళికా బద్ధంగా నిర్వహించాలన్నారు. తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ నిర్వహించాలన్నారు. శనివారం మధ్యాహ్న భోజన పథకంలో ఉండే మెనూనే వడ్డించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ మెనూ మార్చవద్దన్నారు. అర్బన్ రేంజ్ డీఐఈ దిలీప్ కుమార్, ఎంఈవో–2 రమా రజని, అర్బన్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలకు సర్వం సిద్ధం



హుకుంపేటలో నాగుపాములు ప్రత్యక్షమైన నుయ్యి



ప్రత్యక్ష నాగదేవత ఆలయం (పాములగుడి)



కాశీ నాగలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

- పాములగుడిలో పూర్తయిన ఏర్పాట్లు
- నేడు సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటలోని ప్రత్యక్ష నాగదేవత ఆలయం (పాములగుడి)లో శనివారం జరిగే షష్ఠి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. 1991లో ఒక నుయ్యిలో రెండు నాగపాములు ప్రత్యక్షమై, అక్కడే కాలధర్మం చెందాయి. ఆ ప్రాంతంలో సింగిడి యేసు, సింగిడి మురళి అనే సోదరులు ప్రత్యక్ష నాగదేవత ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి భక్తులు ఈ నాగదేవత ఆలయానికి వచ్చి అన్నపూర్ణా సమేత కాశీ నాగలింగేశ్వరస్వామిని పూజిస్తారు. పాములు ప్రత్యక్షమైన నుయ్యిలో, అక్కడ ఉన్న పుట్ట వద్ద కొబ్బరికాయలు కొట్టి పాలు పోయడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ నిర్వాహకులు సింగిడి గంగాధర్, సింగిడి గంగరాజు, బాలిన వెంకటరత్నం ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆలయ ఆవరణలో వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందని ఆలయ అర్చకుడు బాపిరాజు శర్మ తెలిపారు.

సంపూర్ణ అక్షరాస్యత సాధనే ధ్యేయం



భవానీకి నియామక పత్రం అందజేస్తున్న వేణు తదితరులు

సీటీఆర్ఐ: విద్యాహక్కు చట్టం ప్రకారం కార్పొరేట్ విద్యాసంస్థలు పేదలకు 25 శాతం ఉచిత సీట్లు ఇవ్వాలని పేరెంట్స్ టీచర్స్ అండ్ స్టూడెంట్స్ యునైటెడ్ ఫెడరేషన్ (పీటీఎస్ఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు కొల్లాపు వేణు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సంపూర్ణ అక్షరాస్యత సాధనే ధ్యేయంగా అందరూ చదవాలి.. అందరూ ఎదగాలి అన్న లక్ష్యంతో పీటీఎస్ఎఫ్ ఏర్పడిందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఏ ప్రకారం 6 నుంచి 14 ఏళ్ల వయసు పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య అమలులో ఉందన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు 25 శాతం పేదలకు ఉచిత సీట్లు ఇవ్వాలని, కానీ ఆ నిబంధనలు పట్టించుకోవడం లేదన్నారు. కాగా.. సేవా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నల్లబోతుల భవానీని రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమించినట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలిగా పెందుర్తి ధనలక్ష్మి, మహిళా కార్యదర్శిగా పరమట భారతి, సహాయ కార్యదర్శిగా దొంగా పద్మజ నియమితులయ్యారన్నారు.

సినిమాలు



శ్యామల	:	పుష్ప–2
సూర్యమినీ	:	పుష్ప–2
సూర్యప్యాలెస్	:	పుష్ప–2
శివజ్యోతి	:	పుష్ప–2
అనుశ్రీ	:	పుష్ప–2
స్వామి	:	పుష్ప–2
అశోక	:	పుష్ప–2
రాజా	:	పుష్ప–2
రంభ	:	పుష్ప–2
ఊర్వశి	:	పుష్ప–2
మేనక	:	పుష్ప–2
కుమారి	:	పుష్ప–2
అప్సర	:	పుష్ప–2
నామవరం		
వీఎస్ మహల్	:	పుష్ప–2
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	పుష్ప–2
కడియం		
వెంకటసూర్య	:	పుష్ప–2

ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్



పోలింగ్ కేంద్రానికి వస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్



పోలింగ్ కేంద్రం వద్ద జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు

రాజమహేంద్రవరం రూరల్: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ మండలంలోని బొప్పన సావిత్రమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు పోలింగ్ (90.17 శాతం) జరిగింది. ఎన్నికల ప్రక్రియను ఎన్నికల అబ్జర్వర్ కె.హర్షవర్ధన్, జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, ఎస్పీ డి.నరసింహ కిశోర్, డీఆర్వో సీతారామయ్య, ఆర్‌డీవో కృష్ణ నాయక్ తదితరులు పరిశీలించారు. రూరల్ తహసీల్దార్ సూర్య కుమార్, బొమ్మూరు, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు కాశీ విశ్వనాథ్, మంగాదేవి, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పర్యవేక్షించారు.

వృద్ధులకు పింఛన్ల పంపిణీ అభినందనీయం

సీటీఆర్ఐ: గత 14 ఏళ్లుగా వృద్ధులకు పింఛన్లు, విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేయడం అభినందనీయమని వాసంశెట్టి గంగాధర్ అన్నారు. వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ఆనందా గార్డెన్స్‌లో వృద్ధులకు పింఛన్లు, పేద విద్యార్థికి ఉపకార వేతనం పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అధ్యక్షతన ఈ కార్యక్రమంలో 80 మంది వృద్ధులకు రూ.500 చొప్పున అందజేశారు. గంగాధర్ భార్య దివంగత వరలక్ష్మి సంస్మరణార్థం మధ్యాహ్నం అన్నదానం, దుప్పట్ల పంపిణీ నిర్వహించారు. వారణాసి కామేశ్వరి (హైదరాబాద్) నిరుపేద విద్యార్థినుల విద్య కోసం రూ.15 వేలు, ర్యాలీ ఉమా మహేశ్వరరావు రూ.5 వేలు విద్య నిమిత్తం అందచేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు పామర్తి గోపాలరావు, భేరి రత్నాంబ, లంకే శ్రీదేవి, శీలం రామకృష్ణ, అనసూరి శ్రీనివాస్, బొల్లా సత్తిబాబు పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న గంగాధర్ తదితరులు

భూసార పరిరక్షణ మనందరి బాధ్యత

- కేవీకే ప్రధానాధికారి నాయుడు
- ఘనంగా ప్రపంచ నేలల దినోత్సవం

రాజానగరం: భూసారాన్ని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అని కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. కేవీకేలో గురువారం రైతులతో కలిసి ప్రపంచ నేలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డాక్టర్ నాయుడు మాట్లాడుతూ నేల స్వరూపాన్ని, స్వభావాన్ని, పోషకాలను కాపాడుతూ చేపట్టాల్సిన నిర్వహణపై అవగాహన కలిగించారు. అధిక దిగుబడులు సాధించాలనే తపనతో మోతాదుకు మించి ఎరువులు, పురుగుమందులను ఇష్టానుసారంగా వాడటం వలన భూసారం దెబ్బతింటుందని అనేక అధ్యయనాలు తెలియజేస్తున్నాయన్నారు. భావితరాలకు ఆరోగ్యవంతమైన, సారవంతమైన భూములను అందించడం మనందరి బాధ్యత అని గుర్తు చేశారు. ఇష్టానుసారంగా రసాయన ఎరువులను వినియోగించడాన్ని మానివేసి, ఆరోగ్యవంతమైన పంటలను పండించేలా సేంద్రియ ఎరువులను వాడుకోవాలన్నారు. గ్లోబల్ వార్మింగ్‌ను కట్టడి చేయడానికి ఆరోగ్యవంతమైన నేలలు ఉపయోగపడతాయన్నారు. అనంతరం రైతులకు భూసార పరీక్షా పత్రాలను అందజేశారు. .



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నాయుడు

జీజీయూలో..

గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ, వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ నేలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఓడీ బీవీవీ బలరామ్ భగత్ మాట్లాడుతూ బాధ్యతాయుతమైన పౌరులుగా భావితరాల కోసం భూసారాన్ని కాపాడటం మనందరి బాధ్యత అని గుర్తు చేశారు.

పోషక యాజమాన్య పద్ధతులు పాటించాలి

మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, భూసారాన్ని కాపాడుకునేలా సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను అనుసరించాలని దివాన్ చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు సూచించారు. వ్యవసాయ శాఖ, ఏరువాక కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో దివాన్ చెరువులో రైతులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలిసి గురువారం ప్రపంచ నేలల దినోత్సవం నిర్వహించారు.

ఉద్యోగం ఇప్పిస్తానని రూ.6 లక్షలకు టోకరా

కంబాలచెరువు: ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఒక వ్యక్తి మోసం చేసిన సంఘటనపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. టి.నగర్‌కు చెందిన టి.దుర్గా వెంకట సత్యనారాయణకు తణుకు చెందిన ఓ.రమేష్‌తో రెండేళ్ల క్రితం పరిచయమైంది. సత్యనారాయణకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రమేష్ దఫదఫాలుగా రూ.6 లక్షలు తీసుకున్నాడు. ఆ తర్వాత ఉద్యోగం విషయం గురించి సమాధానం చెప్పడం లేదు. అలాగే కనిపించడం కూడా మానేశాడు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో సత్యనారాయణ ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

నర్సరీల ఫోన్ నంబర్లు

సత్యనారాయణ నర్సరీ గార్డెన్స్	94403 18373
సత్యదేవ	93940 89571
వీరహనుమాన్	94401 76254
సత్యనారాయణ	93939 11199
అంబికా	93911 16111
వెంకటసూర్య	99596 97999
సత్యజానకి దుర్గ	93488 85859
విజయదుర్గా	93979 22226
సాయిరామకృష్ణ	94901 67345
శివపార్వతి	98496 95729
తారకజయలక్ష్మి	0883 2453496
ఓం సాయిరామ్	99637 15415
మురళీకృష్ణ	99089 89205
సత్య భాస్కర	94403 95494
వరలక్ష్మి	94403 32989
గౌతమి	94404 90209
దుర్గా ప్రసన్న	93463 14808
లక్ష్మీ	99633 46686
కేదార్‌నాథ్	99892 42413
రంగనాథ్	95736 22999
సాయిరామ్	97013 03991
సత్యసూర్య	94411 43695
జ్యోతి	98660 45378
సూర్యలక్ష్మి	94406 69084
శాంతి	98663 67899
దుర్గామణికంఠ	99497 55666
అనంతలక్ష్మి	98660 00339
వీర వెంకట సత్యనారాయణ	94408 64591
సాయిసత్య	91776 79597
రామాంజనేయ	99664 88419
సత్యనారాయణ నర్సరీ బయోటెక్	94401 79028
విశ్వేశ్వర హైటెక్ నర్సరీ	94403 40141
సత్యశ్రీ నర్సరీ గార్డెన్స్	94416 10620
శ్రీరామసాయి	99859 48699